

హరోం హర..

శివనామస్మరణతో కొత్తచెరువు మార్మోగింది. మండల కేంద్రంలో వెలసిన సంగమేశ్వరుడి రథోత్సవం గురువారం వేలాది మంది భక్తాదుల శివనామస్మరణ నడుమ అత్యంత వైభవంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలు వారం రోజులుగా కొనసాగుతున్నాయి. గురువారం బ్రహ్మ రథోత్సవం సందర్భంగా సంగమేశ్వరుడు, పార్వతి దేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకీలో తీసుకొచ్చి రథంపై ఆశీనులు గావించారు. ఉదయం 11.30 గంటల సమయంలో భక్తులు నమఃశివాయ అంటూ రథాన్ని లాగారు. వేలాదిగా భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సాయంత్రం మడుగు తేరును లాగి యథాస్థానంలోకి తేరును తీసుకొచ్చారు. -కొత్తచెరువు


వేలాదిమంది భక్తుల నడుమ కదులుతున్న రథం


రథంలో ఆశీనులైన పార్వతీపరమేశ్వరులు

హంస వాహనంపై చెన్నకేశవుడి విహారం



పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ బ్రహ్మోత్సవాల తొమ్మిదోరోజు గురువారం ఉదయం స్వామివారు పుష్పమండపంపై, సాయంత్రంపై హంస వాహనంపై ఊరేగారు. ఉదయాన్నే స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పుష్ప మండపంపై కొలువుదీర్చారు. పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం 10గంటలకు వసంతోత్సవం, చక్రస్నానం కనులపండువగా సాగింది. సాయంత్రం 6గంటలకు హంసవాహనంపై స్వామివారు.. భక్తులకు దర్శనమిచ్చారు. -ధర్మవరం


హంసవాహనం, పుష్పమండపంపై ఆశీనులైన చెన్నకేశవుడు


జనసందోహం నడుమ కదులుతున్న రథం

రామభక్తా.. శ్రీ ఆంజనేయా..

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



జైశ్రీరామ్ నామస్మరణతో హిందూపురం మండలంలోని సంతేబిదునూరు గ్రామం మార్మోగింది. రామభక్తుడైన ఆంజనేయ స్వామి బ్రహ్మరథోత్సవం గురువారం వైభవోపేతంగా సాగింది. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్రహ్మరథోత్సవం వేలాది మంది భక్తుల నడుమ సాగింది. మధ్యాహ్నం ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మేళతాళాల మధ్య రథం వరకు తీసుకెళ్లారు. తేరుపై అధిరోహింపజేసి, పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని ముందుకు లాగారు. ఉమ్మడి జిల్లాతోపాటు కర్ణాటక నుంచి వేలాదిగా తరలిరావడంతో గ్రామం జనసంద్రమైంది. రథోత్సవానికి హాజరైన భక్తులకు పలువురు టీడీపీ నాయకులు అన్నదానం చేశారు.

-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తరువాత రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దాడులు, హింసాత్మక ఘటనలతో రాష్ట్రం అట్టుడికింది. దీంతో ఎక్కడ, ఎలాంటి గొడవ తలెత్తుతుందోనని సామాన్య జనం, పోలీసులు బిక్కుబిక్కుమంటున్నారు. ఎక్కడా నలుగురు కూర్చుని మాట్లాడుకోలేని పరిస్థితులు దాపురించాయి. పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు, బైండోవర్లు, హౌస్ అరెస్టులు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ, టీడీపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు ఒకచోట కలిస్తే.. అదీ ఒకే గదిలో కూర్చుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేం. అలాంటి దృశ్యం గురువారం హిందూపురం మండలంలోని సంతేబిదునూరు గ్రామ సచివాలయంలో ఆవిష్కృతమైంది. మధ్యాహ్నం సంతేబిదునూరు

ఆ అరగంట..!

ఒకే గదిలో టీడీపీ, వైసీపీ నేతలు

మౌనంగా కూర్చున్న వైనం.. పోలీసులకు ముచ్చెమటలు



గ్రామంలో ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం కార్యక్రమం జరిగింది. ఒంటి గంటకు బ్రహ్మరథోత్సవం ఉంటుందని టీడీపీ నేతలు వెళ్లారు. ఆలస్యమవుతుందని అర్చకులు తెలపడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, సీనియర్ నాయకుడు నాగరాజు, మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి, మరికొంతమంది నాయకులు పక్కనే ఉన్న గ్రామ సచివాలయంలోకి వెళ్లి కూర్చున్నారు. కాసేపటికి వైసీపీ జిల్లా అధ్యక్షులు నవీన్‌నిశ్చల్, హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక భర్త వేణురెడ్డి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, నాయకుడు కొండూరు వేణుగోపాల్ రెడ్డి టీడీపీ నేతలు కూర్చున్న గ్రామ సచివాలయంలోకి వచ్చారు. తెలుగుదేశం నాయకులు ఉన్నారన్న సమాచారం వారికి తెలుసో.. లేదోకానీ, వారు కూడా సచివాలయంలోకి వచ్చారు. దీంతో అక్కడున్న టీడీపీ నాయకులు కొంతమంది బయటికి వెళ్లారు. వచ్చిన వైసీపీ నేతలు కూడా టీడీపీ నాయకుల మధ్యలోనే కూర్చుండిపోయారు. ఒకరినొకరు పలకరించుకోలేదు. అరగంటపాటు సచివాలయంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. నాయకులు మాట్లాడుకుంటారేమోనని ఇరుపార్టీల కార్యకర్తలు చూశారు. ఒక్కరు కూడా పెదవి విప్పలేదు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని బందోబస్తుకు వచ్చిన పోలీసులకు ముచ్చెమటలు పట్టాయి. సచివాలయం సమీపంలోకి చేరుకుని, నిఘా పెట్టారు. లోపల ఏం జరుగుతుందో ఇతరులను పంపించి, అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో నాయకుల వద్దకు వెళ్లడానికి పోలీసులు వెనకడుగేశారు. అరగంట తరువాత బ్రహ్మరథోత్సవం ప్రారంభం కావడంతో నాయకులు వెళ్లిపోయారు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ అర గంట ఇరుపార్టీల నేతలు ప్రదర్శించిన సంయమనం.. ఆదర్శమనీ, రాష్ట్రంలో ప్రస్తుతం ఎంతో అవసరమని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

-హిందూపురం


సచివాలయంలో మౌనంగా ఉన్న టీడీపీ, వైసీపీ నేతలు

కనులపండువగా ఖాద్రీశుడి మల్లెపూలోత్సవం



కదిరి పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి మల్లెపూలోత్సవం గురువారం కనులపండువగా సాగింది. వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారిని ఆలయం నుంచి తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం మల్లెపూల మండపానికి చేర్చారు. నిత్యకైంకర్యాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. మల్లెపూల అలంకరణలో స్వామివారిని దర్శించుకోవడానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

- కదిరి

మల్లెపూల మండపంలో కొలువుదీరిన శ్రీవారు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.71.70 లక్షలు

కదిరి, మే 23: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. 50 రోజులకుగాను రూ.71.70 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. హుండీల లెక్కింపు శుక్రవారం కూడా కొనసాగుతుందన్నారు. హుండీ లెక్కింపులో దేవాదాలయ సిబ్బంది రమేష్‌బాబు, ఎస్‌బీఐ మేనేజర్ శ్రీరాఘవేంద్ర పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

ఎన్నికల డబ్బు వెనక్కి..!

పురం వైసీపీలో రాజుకుంటున్న చిచ్చు

రికవరీ చేస్తారన్న ప్రచారం

అభ్యర్థివర్గంపై కొంతమంది కౌన్సిలర్లు గుర్రు


ఒకరి రాజీనామా.. అదేబాటలో మరికొంతమంది..



హిందూపురం, మే 23: అధికార పార్టీలో డబ్బు పంపిణీ చిచ్చు ఇప్పట్లో చల్లారేలా కనిపించట్లేదు. పోలింగ్ ముగిసి పదిరోజులైనా ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఇచ్చిన డబ్బు వ్యవహారం రోజురోజుకీ ఆ పార్టీలోని నాయకుల్లో కాక పుట్టిస్తోంది. ఈ వ్యవహారంలో హిందూపురంలో ఆ పార్టీ నాయకులపై పెద్ద దుమారమే రేగుతోంది. రెండు రోజులుగా తారస్థాయికి చేరిందని చెప్పొచ్చు. వైసీపీ కార్యాలయంలో మూడు రోజుల క్రితం డబ్బు విషయంలో ఇద్దరు కౌన్సిలర్లు కొట్టుకున్న విషయం విదితమే. ఇదే విషయంపై ఒక కౌన్సిలర్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిని ఆమోదిస్తారా.. తిరస్కరిస్తారా.. అన్న విషయం పక్కన పెడితే మరికొంతమంది కూడా ఆయన బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో డబ్బు పంపిణీ వ్యవహారం అధికార పార్టీలో ఏ స్థాయిలో చిచ్చు రగుల్చుతోందో అర్థం చేసుకోవచ్చు.

రికవరీ చేస్తారన్న ప్రచారం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఒకరోజు ముందు పట్టణంలోని ఓటర్లకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి.. ఆయా కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలకు డబ్బు అప్పగించారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పట్టణంలోని అన్నివార్డుల్లో 3వేలకుపైగానే ఓట్లున్నాయి. కొన్ని వార్డుల్లో రూ.4వేలకుపైగా కూడా ఉన్నాయి. దీంతో ఒక రాత్రి, పగలులో డబ్బు పంపిణీ చేయడం వీలుకాదు. దీంతో అధికార పార్టీలోని కొంతమంది కౌన్సిలర్లు, నాయకులు డబ్బు తీసుకెళ్లి వార్డుల్లో ఓటర్లకు సరిగా పంపిణీ చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పోలింగ్ అనంతరం కొన్ని వార్డుల నుంచి పలువురు ఓటర్లు వచ్చి, తాము ముందునుంచీ వైసీపీకి ఓటేస్తున్నామనీ, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నామనీ, అయినా వార్డు కౌన్సిలర్లు, నాయకులు, డబ్బు ఇవ్వలేదని అభ్యర్థికి ఫిర్యాదు చేశారు. మరికొన్నిచోట్ల కొంతమందికే ఇచ్చి, మిగతావారికి పంచలేదని ఫిర్యాదులు చేయడంతో అభ్యర్థి దీపిక భర్త వేణురెడ్డి దీనిని సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. కొన్ని వార్డుల్లో డబ్బు పంపిణీ సరిగా చేయలేదనీ, అలాంటి చోట్ల రికవరీ చేస్తామని వేణురెడ్డికి దగ్గరగా ఉన్న నాయకులు లీకులు ఇచ్చారు. ఇది పట్టణంలో దావాణలంలా వ్యాపించింది. కౌన్సిలర్, వార్డు ఇన్‌చార్జిల వద్ద ఉన్న ముఖ్య కార్యకర్తలు దీనిని జీర్ణించుకోలేకపోతున్నారు. ఐదేళ్లగా వీరి వెంట ఉన్నా కనీసం తమకు కూడా చెప్పకుండా డబ్బు మిగిలించుకున్నారని మండిపోతున్నారు. దీంతో రికవరీ చేస్తారన్న ప్రచారం నాయకులను వెంటాడుతోంది. కొంతమంది అభ్యర్థి వర్గానికి దగ్గరగా ఉన్న ముఖ్య నేతలు రికవరీ చేస్తామని ప్రచారం చేయడంతో అధికార పార్టీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. ఐదేళ్లగా తమను వాడుకున్నారని వారు వాపోతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి కౌన్సిలర్లుగా గెలిస్తే మూడేళ్లగా తమను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ఆవేదన చెందుతున్నారు. కనీసం పెట్టిన ఖర్చులకు వడ్డీ కూడా రాలేదని మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఒకరిద్దరికి రూ.50వేలు, రూ.లక్ష మిగిలి ఉంటుందనీ, దానిని పట్టుకుని అధికశాతం మంది కౌన్సిలర్లను దొంగలుగా చూడటం సబబుకాదంటూ బహిరంగంగా విమర్శిస్తున్నారు. దీంతో కౌన్సిలర్లలో కొంతమంది, అభ్యర్థి చుట్టూ ఉన్న కోటరీ నాయకులపై గుర్రుగా ఉన్నారు.





మరికొంతమంది రాజీనామా బాట

డబ్బు పంపిణీ వ్యవహారం హిందూపురం అధికార పార్టీలో ఓ కుదుపు కుదిపింది. అధికార పార్టీ పాలకవర్గంలో అందరికీ పెద్దాయనగా ఉండే కౌన్సిలర్ తన పదవికి రాజీనామా చేశారు. కొన్ని వార్డుల్లో కౌన్సిలర్లు కాకుండా నాయకులకు డబ్బు ఇచ్చారు. దీంతో కౌన్సిలర్లు, నాయకుల మధ్య అగాథం పెరిగింది. ఈనేపథ్యంలో మరికొంతమంది కౌన్సిలర్లు కూడా రాజీనామా చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఈ పార్టీలో ఉండటంకంటే రాజీనామా చేసి తటస్థంగా ఉండటమే నయమని కొంతమంది అధికార పార్టీ కౌన్సిలర్లు ఆలోచనలో పడ్డారు. మరోవర్గం నాయకులు మాత్రం కొంతమంది కౌన్సిలర్లు, నాయకులపై దుమ్మెత్తిపోస్తున్నారు. కొంతమంది డబ్బు మిగిలించుకున్న విషయం వాస్తవమే. రికవరీ చేస్తారన్న ప్రచారం నేపథ్యంలో డబ్బు వాపసు ఎందుకు ఇవ్వాలన్న ఉద్దేశంతో రాజీనామా అస్త్రాన్ని తెరపైకి తెస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. డబ్బు వెనక్కివ్వడం ఇష్టంలేకనే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆ పార్టీలో జోరుగా చర్చ సాగుతోంది. ఏది ఏమైనా హిందూపురం అధికార పార్టీలో డబ్బు పంపిణీ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతూ ఎక్కడికి దారితీస్తుందోనని ముఖ్య నాయకులు చర్చించుకుంటున్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



కొత్తచెరువు, మే 23: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు డీఐఈఓ రఘునాథరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ వారికి పరీక్షలుంటాయన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 7501 మంది, ద్వితీయ సంవత్సరానికి 2,960 మంది హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని ఆయన తెలిపారు.

కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కొత్తచెరువు, మే 23: జిల్లాలోని కస్తూరాగాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి బాలికలు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నల్లచెరువులో ఎంపీసీ, తనకల్లులో బైపీసీ, గాండ్లపెంటలో ఎంపీసీ, కనగానపల్లిలో ఎంపీసీ గ్రూపులలో సీట్లు ఉన్నాయన్నారు. వివరాలకు ఏజీసీడీఓను 9100599960 నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

కౌంటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

పుట్టపర్తి, మే 23: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు వివరించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష చేశారు. కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. కౌంటింగ్ కేంద్రాల్లో 119 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. కేంద్రబలగాలతోపాటు 460 మంది సివిల్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో 160 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని మానిటరింగ్ రూంకు అనుసంధానం చేశామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.

వైభవంగా బుద్ధపూర్ణిమ


బుద్ధుని విగ్రహానికి పూజలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు

పుట్టపర్తి, మే 23: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం బుద్ధ పూర్ణిమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి భగత్‌కిషన్‌రావు, సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. కేంద్రమంత్రి, ట్రస్టు సభ్యులు, నార్త్‌జోన్ సేవాదళ్ అధ్యక్షుడు సంజయ్ అగర్వాల్, బౌద్ధ భిక్షువులు.. బుద్ధుని విగ్రహానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు వక్తలు.. బుద్ధుడి బోధనలపై ప్రసంగించారు. నేపాల్ భక్తులు ఆ దేశ సంప్రదాయరీతిలో నృత్యప్రదర్శన చేపట్టారు. బౌద్ధ భిక్షువులు సన్నాయినాదంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం భక్తిపాటలు ఆలపించారు. వేడుకల్లో సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, జపాన్, తైవాన్, నేపాల్, శ్రీలంక తదితర దేశాలకు చెందిన 200 మంది భక్తులు పాల్గొన్నారు.


ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు

జిల్లాకు భారీ వర్ష సూచన

అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



అనంతపురం టౌన్, మే 23: రానున్న మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలపై కలెక్టరేట్‌లో ముందస్తు చర్యలకు సంబంధించి గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిస్తే ఏయే చర్యలు చేపట్టాలన్న విషయమై క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. తహసీల్దార్, వీఆర్‌ఏ, వీఆర్‌ఓలు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. వరి, మొక్కజొన్న కోత దశలో ఉన్నందున నీరు నిల్వ ఉండకుండా వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేయాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లను అందించాలని సూచించారు. గ్రామ, మండలస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా వెంటనే మరమ్మతులు జరిగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నగరంలో ఎమర్జన్సీ రెస్పాన్స్ వాహనం ఏర్పాటు చేసి డ్రైనేజీల్లో పూడికతీత, పడిపోయిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. కల్వర్టులు తెగిపోయే ప్రమాదం ఉందని, మట్టికంకర సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్‌నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, పలుశాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

కె-6 రకం క్వింటం ధర రూ.9500

40 శాతం సబ్సిడీ వర్తింపు

అనంతపురం అర్బన్, మే 23: జిల్లాలోని ఆర్బీకేల్లో శుక్రవారం నుంచి విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం కానుంది. జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్‌కు 81832 క్వింటాళ్ల వివిధ రకాలు విత్తనాలు కేటాయించారు. ఇందులో వేరుశనగ 76710 క్వింటాళ్లు కేటాయించారు. కంది 2300, మినుములు 46, పెసలు 85, రాగి 4, కొర్ర 50, వరి 1600, జీలుగ 200, పిల్లపెసర 25, ఉలవలు 700, అలసంద 106, జనుము 7 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు. ఇప్పటిదాకా జిల్లావ్యాప్తంగా ఆర్బీకేలకు 29208 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేశారు. అయితే అంతర పంటల విత్తనాల సబ్సిడీ ధరలు ఇంకా ఖరారు చేయలేదు. పచ్చిరొట్టే ఎరువులు జీలు, జనుము, పిల్లిపెసరలకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేసినప్పటికీ ఇంకా జిల్లాకు స్టాక్ తెప్పించలేదు. సబ్సిడీ ధరలు ఖరారైన తర్వాత అంతర పంటల విత్తనాలు పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తొలుత కేవలం విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని నిర్ణయించారు.

గరిష్ఠంగా మూడు బస్తాలు పంపిణీ

ఒక్కో రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాల వేరుశనగ పంపిణీ చేయనున్నారు. ఒక్కో రైతుకు అర్ధ ఎకరా దాకా ఒక బస్తా (30 కేజీలు) విత్తన వేరుశనగ పంపిణీ చేస్తా రు. అర్ధ ఎకరా నుంచి ఒక ఎకరా దాకా రెండు బస్తాలు (60 కేజీలు), ఎకరాపైగా భూమి కలిగిన రైతులకు 3 బస్తాలు (90కేజీలు) పంపిణీ చేయనున్నారు.

వేరుశనగ సబ్సిడీ ధరలు...

విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఎట్టకేలకు ఖరారుచేశారు. కె-6 రకం వేరుశనగ క్వింటా పూర్తి ధర రూ.9500లుగా నిర్ణయించారు. ఈసారి 40 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఈ లెక్కన క్వింటాకు సబ్సిడీ మొత్తం రూ.3800పోను రైతు వాటా క్వింటాల్ ధర రూ.5700 చెల్లించాల్సి ఉంటుంది. కదిరిలేపాక్షి రకం వేరుశనగ పూర్తి ధర రూ.8700గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3480లుపోను రైతు వాటా క్వింటాల్‌కు రూ.5220 చెల్లించాల్సి ఉంటుంది.

వేరుశనగ బస్తాల వారీగా ధరల వివరాలిలా..

వేరుశనగ రకం	మోతాదు	పూర్తి ధర	సబ్సిడీ మొత్తం	రైతు వాటా
కె-6	బస్తా (30 కేజీలు)	రూ.2850	రూ.1140	రూ.1710
కె-6	2 బస్తాలు(60కేజీలు)	రూ.5700	రూ.2280	రూ.3420
కె-6	3 బస్తాలు(90కేజీలు)	రూ.8550	రూ.3420	రూ.5130

వేరుశనగ రకం	మోతాదు	పూర్తి ధర	సబ్సిడీ మొత్తం	రైతు వాటా
కదిరి-లేపాక్షి	బస్తా (30 కేజీలు)	రూ.2610	రూ.1044	రూ.1566
కదిరి-లేపాక్షి	2 బస్తాలు(60కేజీలు)	రూ.5220	రూ.2088	రూ.3132
కదిరి-లేపాక్షి	3 బస్తాలు(90కేజీలు)	రూ.7830	రూ.3132	రూ.4698

సంబరాలకు నో

తిరునాళ్లకు బ్రేక్... బాణసంచాపై నిషేధం

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల చర్యలు

అనంతపురం క్రైం, మే 23: తిరునాళ్లు.. జాతర అంటే సంబరం అంతా ఇంతా కాదు. అయితే ఈసారి అంతజోష్ ఉండదు. కేవలం స్వామికి కొబ్బరికాయ కొట్టి దర్శనం చేసుకొని రావాల్సిందే. ఇక ఎన్నికల గెలుపోటముల అనంతరం టపాసుల శబ్దం రాకూడదు. సంబరాలకు పోలీసులు నో చెప్పేశారు. తాడిపత్రి పట్టణంలో జరిగిన అల్లర్లు, జిల్లాలో అక్కడక్కడ జరిగిన సంఘటనల నేపథ్యంలో పోలీసులను ఈ నిర్ణయం తీసుకున్నారు. పెన్నహోబిళం తిరునాళ్ల మామూలుగానే జరిగిపోతోంది. అయితే వివాదాస్పద ప్రాంతాలు, నియోజకవరాల్లో నిర్వహించే తిరునాళ్లు, జాతర్లకు నో చెప్పేశారు. పెద్దవడుగూరు మండలం రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురంలలో ప్రతి ఏటా వైశాఖ మాసంలో పున్నమి రోజున బండి శూల తిరునాళ్లు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉత్సవాలకు పోలీసులు వద్దని చెప్పేశారు. అధికారులు గ్రామ పెద్దలతో చర్చించినా విఫలమయ్యాయి. ఎన్నికల అనంతరం అని చెప్పినా అప్పుడు ఎవరు అధికారంలోకి వస్తారో..? వారితో మరో పార్టీ వారు కయ్యానికి దువ్వడం లాంటి ఘటనలు జరుగుతాయని పోలీసులు నో చెప్పేశారు. కావాలంటే ఆలయంలో సింపుల్‌గా వెళ్లి పూజలు చేసుకోవచ్చని సలహా ఇచ్చారట.

టపాసుల వాడకంపై నిషేధం: కలెక్టర్

అనంతపురం క్రైం/ టౌన్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పేలుడు చట్టం 1884లోని సెక్షన్ 6(ఏ) మేరకు జూన్ 6వతేదీ వరకు టపాసుల వాడకంపై నిషేధం విధించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాసుల తయారీ, అమ్మకాలు, కొనుగోలు, వినియోగం చేయకూడదని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల మద్దతుదారులు విజయోత్సవాలు నిర్వహించే సమయంలో టపాసులు వినియోగించరాదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

అక్రమంగా నిల్వచేసిన టపాసులు సీజ్

పుట్టపర్తి రూరల్: ఎనుమలపల్లిలో అక్రమంగా నిల్వచేసిన టపాసులను సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు. తనిఖీల్లో భాగంగా గురువారం ఎనుమలపల్లి శిల్పారామం వెనుకభాగంలోని గోవర్ధన్‌రెడ్డికి చెందిన వ్యవసాయ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 45వేల విలువచేసే టపాసులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.



టపాసుల గౌడోన్‌ను పరిశీలిస్తున్న సీఐ కొండారెడ్డి

ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ పట్టా!

రెవెన్యూ అధికారుల మాయాజాలం

ఆమ్యామ్యాలతో డీసీఎంఎస్ స్థలానికి పట్టాలు

అధికారపార్టీ ప్రజాప్రతినిధి అండతో ఆగడాలు

చోద్యం చూస్తున్న డీసీఎంఎస్, సహకార శాఖ అధికారులు

రూ.కోట్ల విలువైన స్థలంపై కబ్జాదారుల కన్ను



ఆక్రమణకు గురైన డీసీఎంఎస్ స్థలం

అనంతపురం క్లాక్‌టవర్, మే 23: రెవెన్యూ అధికారులకు ఆమ్యామ్యాలు అందితే చాలు క్లాక్‌టవర్‌కు సైతం పట్టా ఇచ్చేసేలా ఉన్నారు. ఇందుకు నిదర్శనమే నగరంలోని డీసీఎంఎస్ స్థలానికి పట్టా ఇవ్వడం. రెండేళ్ల కిందట అధికారపార్టీ ప్రజాప్రతినిధి అండతో అనంతపురం రూరల్ తహసీల్దార్ పట్టా సృష్టించారు. రెండేళ్ల కిందట ఒక్కొక్కరితో రూ.5 లక్షలు తీసుకుని గుత్తి రోడ్డులోని డీసీఎంఎస్ స్థలంలో ముగ్గురికి పట్టాలు ఇచ్చారు. ఈక్రమంలోనే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని మరింతగా కొట్టేయాలని ఆక్రమణదారులు కన్నేశారు. ఈక్రమంలోనే ప్రభుత్వ డీసీఎంఎస్ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అందిన కాటికి పుచ్చుకుని మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికే సహకార శాఖ అధికారులు విచారణ పేరుతో పలుమార్లు అక్కడికి వెళ్లి, అందినకాడికి పుచ్చుకుని వచ్చినట్లు సమాచారం.

ఆక్రమణలో 38 సెంట్లు

కొందరు అక్రమార్కులు డీసీఎంఎస్‌కు చెందిన 2.28ఎకరాల స్థలాన్ని క్రమ క్రమంగా ఆక్రమించేందుకు పూనుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లేదారిలో రూ.కోట్ల విలువ చేసే స్థలం ఉంది. ఇందులో గోడౌన్లు, హోటళ్లు, ఇతరత్రవాటిని నడుపుకునేందుకు అద్దెకు ఇచ్చారు. అయితే టెండర్లు లేకుండానే ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇస్తున్నారు. 2.28 ఎకరాల స్థలంలో ఇప్పటికే దాదాపు 38 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైనట్లు సమాచారం. ఇంత బహిరంగంగా నగర నడిబొడ్డున, విలువైన స్థలాన్ని ఆక్రమించుకుంటున్నా డీసీఎంఎస్, సహకార శాఖ అధికారులు ఎందుకు మిన్నకుండిపోతు న్నారో అర్థం కాని పరిస్థితి. స్థలానికి పరిధి నిర్ణయించి కంచె వేయించ కుండా డీసీఎంఎస్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంద రి ఆక్రమణదారులకు సిబ్బంది సహకరిస్తున్నా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదట లీజు, అద్దె పేరుతో అక్కడికి చేరుకుని క్రమంగా పట్టాలు సృష్టిస్తున్నారు. ఇలాగే ఇప్పటికే ముగ్గురు పట్టాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

బినామీ పేర్లతో అద్దెకు దుకాణాలు

నిబంధనలకు విరుద్ధంగా బినామీ పేర్లతో దుకాణాలు అద్దెకిచ్చేశారు. నగర నడిబొడ్డున కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఎటువంటి టెండర్లు, అగ్రిమెంట్లు లేకుండానే ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చేస్తున్నారు. అసలు ఎన్నేళ్ల లీజు, ఎంత కాలం అద్దె తెలియకుండానే మేనేజ్ చేసుకుంటూ వస్తున్నారు. వచ్చే అరకొర అద్దెకు లెక్కల్లేకుండా చేస్తున్నారు. దీంతో డీసీఎంఎస్ అధికారులు, సిబ్బందిపైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విలువైన స్థలంలో కనీసం అగ్రిమెంట్లు లేకుండా లీజు, అద్దెకు ఇస్తుండటమే భూ ఆక్రమణలకు కారణమవుతోందని తెలుస్తోంది. బహిరంగంగా ప్రభుత్వ స్థలాలకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చేస్తున్నా డీసీఎంఎస్ యంత్రాంగం ఎందుకు మిన్నకుండిపోతోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారు లపై ఎందుకు కేసు పెట్టలేదనే చర్చ నడుస్తోంది. ఈ తతంగంలో డీసీఎంఎస్, సహకార శాఖ అధికారులు పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గుత్తిరోడ్డులోని డీసీఎంఎస్ స్థలంలో ప్రైవేటు శాశ్వత నిర్మాణాలు

చోద్యంచూస్తున్న అధికారులు



ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన సహకారశాఖ, డీసీఎంఎస్ అధికారులు చోద్యం చూస్తున్నారు. డీసీఎంఎస్ స్థలాలను పర్యవేక్షిస్తూ కాపాడాల్సిన సహశాఖ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నార నేది ప్రధాన ఆరోపణ. జిల్లా, డివిజన్, సబ్ డివిజనల్, ఆ కిందిస్థాయి సహకార శాఖ అధికారులు ఆయా స్థాయిలో డీసీఎంఎస్ అధికారుల నుంచి ముడుపులు అందుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై పలుమార్లు సహకార శాఖ అధికారులు తూతూమంత్రంగా విచారణ చేసి ఉత్తుత్తి నివేదిక ఇస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.



ప్రైవేటు కేసు వేస్తాం

డీసీఎంఎస్ ప్రభుత్వ స్థలంలో పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై ప్రైవేటు కేసులు వేయాలని నిర్ణయించాం. డీసీఎంఎస్ పాలకవర్గంలో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రభుత్వ స్థలంలో పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులు, తీసుకున్న వారిపై చర్యలకు జిల్లా యంత్రాంగానికి నివేదిస్తాం. ఇప్పటికే ఈ విషయం కోర్టులో నడుస్తోంది. ఎంతటివారైనా సరే భూమి ఆక్రమించిన వారిని వదిలిపెట్టేది లేదు.

- విజయభాస్కర్, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్

ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఇవ్వకూడదు

ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులకు పట్టాలు ఇవ్వకూడదు. చట్టం ప్రకారం ప్రభుత్వ భూములు ప్రభుత్వ కార్యకలాపాలు, కార్యాలయా లకు మాత్రమే వినియోగించాలి. అడ్డదారుల్లో పట్టాలు సృష్టించి స్వాధీనానికి ఉపక్రమిస్తే చట్టపరంగా శిక్షార్హులే. డీసీఎంఎస్ అనేది ప్రభుత్వరంగ సంస్థ. డీసీఎంఎస్ స్థలాలను ఆక్రమించినవారిపై శాఖాపరంగా విచారణ చేసి, చర్యలు తీసుకుంటాం.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)



● ఈయన పేరు పెద్దన్న. నార్పల మండలం బొందలేడు గ్రామం. కొడుకుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో నార్పల ఆస్పత్రిలో చూపించాడు. అక్కడ వారు యూరిన్ పైపు పెట్టారు. వారి సలహా మేరకు అనంతపురంలోని పెద్దాస్పత్రికి తీసుకొచ్చాడు. ఆస్పత్రిలో ద్వారం వద్దకు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక్కడ స్ట్రెచర్, వీల్‌ఛైర్‌కోసం తిరిగాడు. దొరకలేదు. ఏమిచేయలేక కొడుకును అలాగే డాక్టర్ల ఉన్న వార్డుకు నడిపించుకుంటూ తీసుకెళ్లాడు.



● ఇక్కడ స్ట్రెచర్‌లో కనిపిస్తున్నది కంబదూరు మండలానికి చెందిన సుబ్రహ్మ ణ్యం. కాలు విరగడంతో రెండురోజుల కిందట జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. సీటీ స్కాన్ కోసం ఆర్థోడాక్టర్ రాసివ్వగా... అతడిని ఎంఎన్‌ఓ స్ట్రెచర్‌లో పడుకోబెట్టుకొని స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్తున్నాడు. అయితే ఏదో పనిఉందని, కొద్దిసేపు ఉండండని చెప్పి మార్గ మధ్యలో వదిలేసి వెళ్లిపోయాడు. అరగంట అయినా రాలేదు. దీంతో ఆ రోగి బంధువులు ఎంఎన్‌ఓ కోసం స్ట్రెచర్ వద్దే ఎదురుచూస్తూ కనిపించారు.



ఆస్పత్రి తీరు మారదా..?

అందుబాటులో ఉండని సిబ్బంది, స్ట్రెచర్లు, వీల్‌ఛైర్లు

నడవలేని రోగులకు తప్పని కష్టాలు

అనంతపురం టౌన్, మే 23: ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందేందుకు రూ.కోట్లతో అన్ని వసతులు కల్పిస్తున్నామని ఇటుపాలకులు, అటు అధికారులు గొప్పలు చెబుతున్నారు. అయితే అనంత జిల్లా ఆసుపత్రిలో రోగులకు కష్టాలు తప్పడంలేదు. ఈ ఆస్పత్రి ఉమ్మడి జిల్లాకే పెద్దదిక్కు. ఎలాంటి సీరియస్ కేసులైనా ఈ ఆస్పత్రికి తీసుకొస్తుంటారు. అందుకు తగ్గట్టుగా గతంలో కన్నా ఇపుడు డాక్టర్లు, సిబ్బంది, వసతులు కూడా పెరిగాయి. ఆస్పత్రికి చికిత్సకోసం అది నడవలేనోళ్ల రోగులు పరిస్థితి కడుదయనీయంగా ఉంది. నడబలేని రోగుల సేవల కోసం ఎంఎన్‌ఓలు, ఎఫెన్‌ఓలను ప్రత్యేకంగా నియమించారు. నడవలేవని రోగులను స్ట్రెచర్లు, వీల్‌ఛైర్స్‌లలో సంబంధిత డాక్టర్ల వద్దకు తీసుకెళ్లడం, అనంతరం వారిని బయటకు తీసుకురావడం వారు చేయవలసిన విధులు. అయితే అనంతపరుంర పెద్దాసు పత్రిలో వీల్‌ఛైర్‌లు, స్ట్రెచర్లుతో పాటు ఎంఎన్‌ఓలు, ఎఫ్‌ఎన్‌ఓలు ఎప్పుడూ అందుబాటులో ఉండరు. దీంతో నడవలేని రోగుల బంధువులే ఆస్పత్రి అంతా కలియతిరిగి స్ట్రెచర్ లేదా వీల్ ఛైర్ తీసుకొచ్చి రోగులను ఆస్పత్రిలోని వార్డుల్లో డాక్టర్ల వద్దకు తీసుకెళ్తున్నారు. అవేవీ దొరకకపోతే కుటుంబ సభ్యులే రోగులను భుజంమీద లేదా వీపున ఎత్తుకొని డాక్టర్లకు చూపించేందుకు తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో రోగులు, వారి కుటుంబసభ్యులు ఆసుపత్రి తీరుపై నిట్టూరుస్తున్నారు.



● అనంతపురం నగరం పాతవూరుకు చెందిన వ్యక్తి భీమప్ప. ఆయన కూతురుకు కిందపడి కాలు విరిగింది, ఆటోలో పెద్దాసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ అరగంటపాటు ఎంఎన్‌ఓ కోసం, వీల్‌ఛైర్ కోసం చూశారు, ఎక్కడా కనిపించలేదు. చివరకు ఒక స్ట్రెచర్ దొరికితే ఆయనే దానిని ఆటో వద్దకు తోసుకెళ్లాడు. కాలు విరిగిని తన ఆటోలో నుంచి స్ట్రెచర్ మీదకు చేర్చేందుకు నానా అవస్థలు పడుతూ కనిపించాడు. పక్కన ఉన్న ఓ వ్యక్తి సాయంతో ఆమెను స్ట్రెచర్ పైకి చేర్చాడు.

నోరుమెదపని పర్యవేక్షణాధికారులు?

ఆస్పత్రిలో ఎంఎన్‌ఓలు, ఎఫ్‌ఎన్‌ఓలు కలిపి 120మంది వరకు ఉన్నారు. వీరందరు షిఫ్టుల ప్రకారం కేటాయించిన ప్రాంతాలలో విధులు నిర్వర్తిస్తూ రోగులకు సేవలందించాలి. అందు లో భాగంగా కొందరు ఎంఎన్‌ఓలు ఆస్పత్రి ద్వారం వద్ద ఉండాలి. అక్కడవరకు వచ్చిన నడవలేని రోగులను స్ట్రెచర్ లేదా వీల్ ఛైర్‌లో కూర్చోబెట్టుకొని సంబంధిత వా ర్డులకు తీసికెళ్లాలి. అయితే వీరు ఆస్పత్రిలో ఎక్కడ ఉంటారో తెలియడం లేదు. డ్యూటీలో మాత్రం అందరూ ఉన్నారని అధికారులు చెబుతుంటారు. వారు ఎక్కడ ఉన్నారు? ఏమి పనిచేస్తు న్నారు అనే పర్యవేక్షణ కొరవడింది. పర్యవేక్షణకు ఒక సూపరింటెండెంట్, ముగ్గురు ఆర్‌ఎంఓలు, మరోఇద్దరు ఎస్‌ఆర్‌ఎంలు ఉన్నారు. వీరందరు రోజూ ఆస్పత్రికి రోజు వస్తున్నారు. రోగులు పడే బాధలు చూస్తున్నారు, కానీ ఎంఎన్‌ఓల అలసత్వంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థంకాని ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా ఆస్పత్రిలో పేదరో గులకు కష్టాలు తప్పడం లేదంటూ ఆస్పత్రి నుంచి తిరిగి వెళుతున్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మే 23: సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వతేదీ నుంచి ప్రారంభించే ఉచిత శిక్షణ 15రోజుల పాటు సాగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19-45 సంవత్సరాల మధ్య నిరుద్యోగులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 8309915577ను సంప్రదించాలని కోరారు.

ఎన్నికల రెమ్యునరేషన్ ఇవ్వరా..?

నేడు ఉన్నతాధికారులను కలవనున్న సిబ్బంది

అనంతపురం క్రైం, మే 23: ఎన్నికల రెమ్యునరేషన్‌పై ఉద్యోగులు, సిబ్బందిలో ఆందోళన మొదలైంది. ఎప్పుడు ఇస్తారో..? తెలియని పరిస్థితి నెలకొంది. అనంతపురం నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగుల్లో ఈ ఆందోళన ఎక్కువైనట్లు తెలుస్తోంది. ఈ విషయంపై నగరపాలిక సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారట. 2019లో చాలా మందికి రెమ్యునరేషన్ ఇవ్వకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కొందరు వీఆర్‌ఏలు అనంతపురం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి తమ సమస్య చెప్పుకున్నట్లు తెలిసింది. ఇదే సమస్యపై శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను అధిక సంఖ్యలో వెళ్లి కలవనున్నట్లు సమాచారం.

వీఆర్‌కు కానిస్టేబుల్

హిందూపురం, మే 23: లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చెన్నకేశవను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ అయినట్లు డీఎస్పీ కంజక్షన్ గురువారం తెలిపారు. ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ప్రొటోకాల్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సదరు కానిస్టేబుల్‌పై ఫిర్యాదులు అందాయని, వీటని దృష్టిలో ఉంచుకుని వీఆర్‌కు పంపినట్లు సమాచారం.

కొనసాగిన పేర్ల రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, మే 23

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కోసం రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఐదో రోజైన గురువారం కొనసాగింది. ఇప్పటిదాకా 40,704 మంది రైతులు 35,933 క్వింటాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

పట్టు.. తిరోగమనం!



మల్బరీ పుల్ల నాటుతున్న రైతులు

పడిపోయిన గూళ్ల ధరలు... తగ్గిన మల్బరీ సాగు

రాయితీలను ఎత్తివేసిన ప్రభుత్వం

దిక్కుతోచని స్థితిలో రైతులు

అనంతపురం సెంట్రల్, మే 23: జిల్లాలో వ్యయసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న పట్టుపరిశ్రమ ప్రస్తుతం తిరోగమనం వైపు పయనిస్తోంది. బోరు బావు లు అడుగంటి మల్బరీ సాగుకు సరిపడా నీరు దొరకడంలేదు. దీంతో ఆకు నాణ్యత తగ్గు తోంది. సరైన పోషకాలులేని ఆకును తింటున్న పట్టుపురుగులు నాణ్యమైన గూళ్లను అల్లడంలేదు. వెరసి పట్టుగూళ్లకు మార్కెట్‌లో ధరలు పలకడంలేదు. రూ.700 నుంచి సరాసరి రూ.300కు ధరలు పడిపోయాయని పట్టురైతులు వాపోతున్నారు. పట్టుగూళ్లకు ప్రభుత్వం రాయితీలను చెల్లించడంలేదు. నష్టపరిహారాన్ని ఇవ్వడంలో మీనవేషాలు లెక్కిస్తోంది. ప్రో త్సాహకాలను రద్దు చేసింది. దీనికి తోందు గిట్టుబాటు ధరలు లభించక, పెట్టుబడులు చేతి కందక దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు బాధిత పట్టు రైతులు వాపోతున్నారు. దాదాపు ఐదేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉండడంతో మల్బరీ సాగు తగ్గుతోందంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని అధికారులు మల్బరీ సాగులో దింపుతున్నారని, అయితే పెట్టుబడి కూడా దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ప్రోత్సాహకాల రద్దు...

మల్బరీ సాగుకు గతంలో అడుగడుగునా ప్రభుత్వ పోత్సాహకాలు లభించేవి. అధికారులే రైతుల వద్దకు వచ్చి పట్టుసాగుపై అవగాహన కల్పించేవారు. పట్టుగూళ్లు పెంచే షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 90శాతం వరకు సబ్సిడీ వచ్చేది. అలాగే తక్కువ ధరకే మొక్కలను అందజేసేవారు. సాగుకు అవసరమై ఎరువులు, పంట కూలీ, డ్రిప్పు సామగ్రి, షెడ్డు ఉ ష్ణోగ్రతల నియంత్రణకు అవసరమైన సున్నం, థర్మామీటర్ తదితర వివిధ అనేక ప్రోత్సా హకాలు అందేవి. అయితే వైసీపీ ప్రభుత్వం వాటన్నిటి రద్దుచేసిందని, పట్టుగూళ్లకు ఇవ్వాల్సిన రాయతీలను సైతం ఎత్తివేసిందని రైతులు మండి పడుతున్నారు. ప్రభుత్వ చర్యలతో పట్టుపరిశ్రమ కనుమరగయ్యేదశకు చేరిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మార్కెట్‌లో ధరలేవీ..?

వ్యయప్రయాసాలకోర్చి కుటుంబం మొత్తం కష్టపడితేనే పట్టు గూళ్లు చేతికొస్తాయి. ఏమాత్రం ఆదమరచినా పురుగు దశలోనే శ్రమ మొత్తం దిబ్బపాలవుతుంది. గూళ్ల అమ్మకంలో ఏ మాత్రం ఆలస్యమైనా గుడ్లను కత్తిరించుకుని పురుగులు బయటకు వస్తాయి. ఇక ఆ గుడ్లను పారవేయాల్సిందే. ఇంతటి శ్రమకోర్చి తీసిన పట్టుగూళ్లకు ప్రభుత్వం సరైన మార్కెట్ ధరలు కల్పించడంలేదని మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో గిట్టుబాటు ధరలున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పెంచడంలేదని వాపోతున్నారు.

ఇరిగేషన్ రాయితీ ఎత్తివేత...

సంవత్సర కాలంగా వర్షాలు లేకపోవడంతో బోరుబావులు అడుగంటుతున్నాయి. అరకొర నీటినైనా సక్రమంగా వినియోగించుకోవాలంటే డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకో వాలి. ఒక ఎకరంలో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు రూ.లక్షకు పైగా ఖరవుతుంది. ఇందుకు గత ప్రభు త్వం 90శాతం రాయితీ ఇచ్చేదని, దానిని వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసిందని మండిపడుతున్నారు. దీంతో నీటి లభ్యతను బట్టి సాగువిస్తీర్ణాన్ని కుదించి రేషం మేపుతున్నామని అంటు న్నారు. ఒక్కోసారి మధ్యలోనే బోరుబావులు ఎండిపోయి పంటను వదిలేసుస్తున్నామని వాపోతున్నారు.

గిట్టుబాటయ్యేలా సూచనలు



రైతులకు గిట్టుబాటు అయ్యేలా మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం వేసవిలో నీటి లభ్యతను బట్టి తగిన విస్తీర్ణంలో పంటలు వేయిస్తున్నాం. దీంతో సాగువిస్తీర్ణం తగ్గుతుంది కానీ వర్షాలు ప్రారంభం కాగానే మళ్లీ పెరుగుతుంది. ఎప్పటిక ప్పుడు తోటలను పరిశీలించి నాణ్యమైన మల్బరీ ఆకు వచ్చేలా సూచనలిస్తున్నాం. వేసవి ఉష్ణోగ్రతల వల్ల పట్టుగూళ్ల నాణ్యత తగ్గింది. ఈ క్రమంలో ధరలు తగ్గాయి. రైతులకు అందజేయాల్సిన రాయితీలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

-ఆంజనేయులు, పట్టుపరిశ్రమశాఖ జిల్లా అధికారి

ఘనంగా మొలకల పౌర్ణమి

● పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఈదులపల్లిలో మొలకలను ఊరేగింపుగా తీసుకొస్తున్న చిన్నారులు,


నల్లచెరువులో ప్రత్యేకాలంకరణంలో శ్రీకృష్ణుడు

గాండ్లపెంట, మే 23: మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో మొలక పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు గత వారం రోజుల క్రితమే మొలకల కోసం కుంపెట్లలో నవధాన్యాలు పోశారు. పౌర్ణమి నాటికి అవి మొలకెత్తడంతో వాటిని ఆయా ఆలయాల్లో అందచేసి పూజలు చేశారు. మునగలవారిపల్లిలో చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం గొడుగుల మెరవణి, బండ్ల మెరవణి నిర్వహించి, పానక పందేరంతో మొక్కులు చెల్లించారు. కొటూరు గ్రామంలో ప్రజలు గంగమ్మకు తెల్లవారుజామున జ్యోతులు, బోనాలు సమర్పించారు. తర్వాత రాత్రి అమ్మవారిని ప్రత్యేక అలంకరించి పూజలు చేసి ఎద్దుల బండ్ల మెరవణి చేశారు.

ముదిగుబ్బ: మండలంలోని ఈదులపల్లి గ్రామంలో మొలకల పౌర్ణమి వేడుకలను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు మొలకలను తలపై పెట్టుకుని డప్పువాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. మొలకల పౌర్ణమి రోజున నవధాన్యాల మొలకలను ఊరేగిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయన్న గ్రామస్థులు పేర్కొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

బత్తలపల్లి: మండలంలోని అప్రాచెరువు గ్రామంలో మొలకల పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వారం క్రితమే ఇళ్లలోని కుంపట్లలో నవధాన్యాలను పోశారు. పౌర్ణమి నాటికి అవి మొలకలు వేశాయి. దీంతో ప్రతి ఇంటినుంచి చిన్నారులు, మహిళలు ఆ మొలకలను గ్రామంలో ఊరేగింపు చేసి సమీపంలోని ఆలయానికి తీసుకెళ్లారు. ఆ ఆలయంలో వాటిని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

నల్లచెరువు: మొలకలపౌర్ణమి సందర్భంగా మండలకేంద్రంలోని గీతామందిరంలో గురువారం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భజన బృందాలు భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిగింది. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు వెంకటశివారెడ్డి, నరసింహారెడ్డి, జి. వెంకటరమణ, పెద్ద వెంకటరమణ, రామచంద్రారెడ్డి, వెంకటేష్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

రమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి వేడుకలు

ధర్మవరం: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో గల భగవాన్ రమణ మహర్షి ఆశ్రమంలో ఆశ్రమవ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవు నెయ్యితో జ్యోతిని వెలిగించారు. అక్షరమణమాల పారాయణం చేశారు. గోమాతకు పూజలు చేశారు. సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 1గంటకు నారాయణసేవ చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.


అప్రాచెరువులో మొలకలను తీసుకెళ్తున్న చిన్నారులు, మహిళలు


కొటూరు గంగమ్మకు జ్యోతులబోనాలు తీసుకెళ్తున్న భక్తులు


ధర్మవరంలోని రమణమహర్షి ఆశ్రమంలో గోమాతకు పూజలు

వైభవంగా నారసింహుడి విగ్రహ పునఃప్రతిష్ఠ

ధర్మవరంరూరల్, మే23: మండలంలోని పోతుకుంట ఎస్సీకాలనీలో గల ఆలయంలో గురువారం లక్ష్మీనరసింహస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడురోజుల నుంచి వేదపండితులు వేద మంత్రోచ్ఛారణాల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. గురువారం మంగళవాయిద్యాల నడుమ స్వామివారి విగ్రహాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.


ఆలయంలో పునఃప్రతిష్ఠించిన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం

ఘనంగా అన్నమయ్య జయంతి


అన్నమయ్య విగ్రహానికి పూజలు నిర్వహించిన చిన్నారులు

ధర్మవరం, మే 23: పద కవిత పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి వేడుకలు పట్టణంలోని శ్రీలలిత నాట్యకళానికేతన్ నాట్య గురువులు బాబూబాలాజీ, కమలాబాలాజీ, రామలాలిత్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు 60 మంది చిన్నారులతో కలిసి ర్యాలీగా స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న అన్నమయ్య విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే చిన్నారులు అన్నమయ్య సంకీర్తనలకు భరతనాట్యం, కూచిపూడి, కోలాటం ప్రదర్శించారు.


కోలాటం ఆడుతూ..

ఘనంగా యల్లమ్మ తిరుణాల

నంబులపూలకుంట, మే 23: మండలకేంద్రం లో యల్లమ్మ తిరుణాలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే పూజారి ఆలయ సమీపంలోని పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పలు పూజలు జరిపారు. రాత్రికి భక్తులు పెద్దఎత్తున బోనాలు, జ్యోతులతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించి బోనాలు, జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ తిరునాలకు వితరణ

నంబులపూలకుంట: మండల కేంద్రంలోని నల్లగంగమ్మ తిరునాలకు గురువారం బీజేపీ మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్ రూ.20వేలు వితరణ చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వంద శాతం బీసీజీ వ్యాక్సినేషన్ చేయాలి: డీఎంహెచ్ఓ

పుట్టపర్తి రూరల్, మే 23: జిల్లాలో వందశాతం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ చేయాలని, ఆ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధి తిరిగి రాదని, శాశ్వతంగా నిర్మూలన అవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి సూచించారు. మండలంలోని వెంగళమ్మచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఆమె టీం సభ్యులతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వ్యాక్సినేషన్‌గది, ఫార్మసీ, లేబొరేటరి, కాన్పులగది, వార్డులను పరిశీలించారు. అనంతరం కంబాలపర్తి హెల్త్‌సెంటర్‌ను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల క్షయవ్యాధి తిరిగి రాదన్నారు. శాశ్వతంగా నిర్మూలన అవుతుందన్నారు. ఐదు సంవత్సరాలలో టీబీ వచ్చి తగ్గిపోయినవారు, అరవైఏళ్ల వయసు నిండిన వారు, పొగ తాగేవారు, బీఎంఐ-18 కంటే తక్కువ ఉన్నవారు, షుగర్ ఉన్నవారు, శరీర ద్రవ్యరాశి సూచిక మేరకు ఎత్తుకు తగిన బరువు లేనివారు, టీబీ రోగులతో సన్నిహితంగా ఉండేవారు తప్పకుండా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. 18 ఏళ్ల వయసులోపు ఉన్నవారు, గర్భిణులు, బాలింతలు, క్రోనిక్ వ్యాధులు ఉన్నవారు, హెచ్ఐవీ రోగులు ఈవ్యాక్సిన్ వేసుకోరాదని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నాగరాజునాయక్, డీఏఎల్‌టీ డాక్టర్ తిప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


కంబాలపర్తి హెల్త్‌సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మంజువాణి

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు తెంచుకుపోయారు

చిలమత్తూరు, మే 23: సిగరెట్ కోసమంటూ దుకాణం వద్దకు వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి దుకాణంలో సరుకులు విక్రయిస్తున్న వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసుని లాక్కెళ్లాడు. మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో బుధవారం రాత్రి సుమారు 8.45 గంటల సమయం. ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చారు. అందులో ఒకడు వాహనంపైనే ఉండగా, మరో వ్యక్తి వాహనం దిగి దుకాణం వద్దకు వచ్చి సిగిరెట్ అడిగాడు. దుకాణం నడుపుతున్న వృద్ధ మహిళ ఇంద్రమ్మ అతడికి సిగిరెట్ ఇవ్వడానికి వెనుకకు తిరిగింది. సిగిరెట్ కోసం వచ్చిన వ్యక్తి ఇదే అదునుగా ఒక్క ఉదుటున ఆమె మెడలో ఉన్న బంగారం మాంగల్యం చైనును లాక్కొని వెళ్లాడు. ఆమె వెంటనే తేరుకొని కేకలు వేయడంతో పక్కనే ఉన్న వారు అతడిని వెంబడించడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే మరో వ్యక్తి సిద్ధంగా ఉంచుకున్న ద్విచక్రవాహనం ఎక్కి పరారయ్యాడు. వారు ఎత్తుకెళ్లిన బంగారం మాంగల్యం చైను ఏడు తులాలు ఉందని బాధితురాలు ఇంద్రమ్మ తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారని ఇంద్రమ్మ తెలిపారు. చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నానని ఆమె చెప్పారు. పోలీసులు వెంటనే దుండగులను పట్టుకొని తన బంగారు చైనును తెచ్చివ్వాలని ఆమె కోరారు.


బాధితురాలు ఇంద్రమ్మ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు, మే 23: మండలంలోని పంపనూరు పార్కు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలుపూరు గ్రామానికి చెందిన చంద్రమోహన్ (25) అక్కడక్కడే మరణించాడు. అతను బైక్‌పై ఆత్మకూరు వెళ్లి.. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా... గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చంద్రమోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రమోహన్ మృతదేహానికి టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల నాయకులు నివాళులర్పించారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.04/2024

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
ఎ.శ్రీనివాసరెడ్డి మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 3 కి నోటీసు

3.ఎ.ప్రమోద్ రెడ్డి తండ్రి: ఎ.శ్రీనివాస రెడ్డి, వయస్సు: 26 సం॥లు, ఉద్యోగి: జూనియర్ అసిస్టెంట్ ఆఫీసు / ఆఫ్ ఆపరేషన్ ఎపిఎస్‌పిడిసిఎల్, పుట్టపర్తి నివాసం: డో.నెం. 2-18-ఎ, డ్యామ్ రోడ్డు, గార్లదిన్నె గ్రామం మరియు మండలం అనంతపురం జిల్లా. డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 1,47,868/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 3కి అపోనెంట్ అయిన మీరు 05-06-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ అక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

విస్తృతంగా కార్డెన్ సెర్చ్: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మే 23: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో విస్తృతంగా కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీపీఓలో గురువారం ఎస్పీ మాట్లాడుతూ.. కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాతనేరస్థుల ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌సీలేని ద్విచక్రవాహనాలను సైతం సీజ్ చేస్తున్నామన్నారు. పరిగి మండలం బీజుగానిపల్లిలో ఆరు బైక్‌లు, ఐదు వేటకొడవళ్లను సీజ్ చేశామన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.


మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీఐ


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రాజేంద్రనాథ్ యాదవ్

ఓబుళదేవరచెరువు, మే 23: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ హెచ్చరించారు. మండలంలోని కొండకమర్ల, దిగువపల్లి, కుసుమవారిపల్లి గ్రామాల్లో పోలీసులు గురువారం తనిఖీలు చేశారు. అనుమానాస్పద ఇళ్లల్లో, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. తర్వాత సీఐ అక్కడి ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో 144 సెక్షన్ ఇంకా అమలులో ఉందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, అలాగే ఓట్ల లెక్కింపు కూడా ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించాలని సూచించారు. కౌటింగ్ సమయంలో ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదన్నారు. ఎస్‌ఐలు వంశీకృష్ణ, మగ్బుల్ బాషా, రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం తండాలో పోలీసుల తనిఖీ

గాండ్లపెంట, మే 23: మండలంలోని వేపరాల పంచాయతీ సీఎం తండాలో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎస్ఐ కృష్ణవేణి గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకుని, సమస్యాత్మక గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానంగా ఉన్న వారి ఇళ్లను, పరిసరాలను పరిశీలించామన్నారు. ఎవరూ శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కల్గించకూడదన్నారు. ఫలితాలు వెలువడిన తరువాత సంబరాలు చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

బత్తలపల్లి, మే23: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో గురువారం ఆయన తన సిబ్బందితో వెళ్లి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. గ్రామస్థులు ఏమైనా సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. లేదా పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎవరైనా గ్రామ ప్రశాంతతకు విఘతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కదిరి వాసికి డాక్టరేట్

కదిరిఅర్బన్, మే 23: పట్టణంలోని ఎస్ఎంజేఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన బాటనీ అధ్యాపకుడు మేకల జయరాంకు రాజస్థాన్ సన్‌రైజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఆయన ఆ యూనివర్సిటీలోని బాటని ప్రొఫెసర్ డాక్టర్ దేవేంద్రకుమార్ ఆధ్వర్యంలో మొక్క పెరుగుదలలో విత్తన ప్రభావం అనే అంశంపై పరిశోధన చేశారు. పరిశోధనా పత్రాలు అందుకున్న యూనివర్సిటీ తనకు గత మంగళవారం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు గురువారం ఆయన తెలిపారు. జయరాంకు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


డాక్టరేట్ పొందిన జయరాం

కూటమి విజయం సాధించాలి

● హోమాలు నిర్వహించిన జనసేన నేత చిలకం మధు

ధర్మవరం, మే 23: రాష్ట్రంలో కూటమి విజయం సాధించాలని, అదే విధంగా పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి యాగాలు, హోమాలు నిర్వహించారు. పట్టణంలోని పార్టీ నూతన కార్యాలయంలో గురువారం ఆయన సతీమణి ఛాయాదేవితో కలిసి రాజశ్యామల యాగం, శ్రీశత చండీహోమం, సుదర్శన హోమం, గణపతిహోమం తో పాటు పూర్ణహారతి తదితర పూజలను నిర్వహించారు. అనంతరం మా ట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి విజయం సాధించాలని, పవన్‌కల్యాణ్ అత్యధిక మెజారీటీతో గెలుపొందాలని ఈ హోమాలు చేస్తున్నామన్నారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు సంవృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కూడా ఈపూజలను ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


చండీహోమం నిర్వహిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి దంపతులు

వెంకటతిమ్మాపురంలో రోడ్డుపై మురుగునీరు

● తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో అవస్థ పడుతున్న గ్రామస్థులు


గ్రామంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు




ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డ్రైనేజీల వద్ద రోడ్లపైకి వస్తున్న మురుగునీరు

ధర్మవరం రూరల్, మే 23: మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామంలో రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉంటోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల మురుగునీరు ముందుకు వెళ్లలేక రోడ్డుపై ప్రవహిస్తోంది. గ్రామం నడిబొడ్డున రోడ్డుపై ఆ నీరు పారుతుండడంతోపాటు అక్కడక్కడ నిల్వ ఉంటోంది. దీంతో వాటి నుంచి వచ్చే దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు వల్ల రోడ్డు చిత్తడిగా ఉంటోందని, నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని పలువురు అంటున్నారు. ఇక మురుగుకు రాత్రివేళల్లో దోమలు విజృంభిస్తున్నాయని, వాటి వల్ల రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీలు బాగుచేయించాలని, మురుగునీరు నిల్వలేకుండా చేయాలని వారు కోరుతున్నారు.

కంకర తేలి.. గుంతలు పడి..

● అధ్వానంగా గ్రామీణ రోడ్లు ● ప్రయాణం నరకముంటున్న ప్రజలు

ధర్మవరంరూరల్, మే23: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉందని ఆయా గ్రామప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా ధర్మవరం నుంచి వెంకటతిమ్మాపురం, మాలగుండ్లపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉంది. ఆ గ్రామాల నుంచి నిత్యం ధర్మవరానికి ఆటోల్లో, ద్విచక్రవాహనాల్లో అనేక మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అయితే ఆ రోడ్డుపై ప్రయాణం నరకంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల వల్ల ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. సుమారు 6కిలోమీటర్ల మేర రోడ్డంతా కంకరతేలి గుంతలమయంగా ఉందంటున్నారు. ఇక వర్షం వస్తే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోందంటున్నారు. గుంతల్లో నీరు నిలుస్తుండడంతో వాటి లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నామని చెబుతున్నారు. విషయం తెలిసినా సంబంధితాధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగుచేయాలని వారు కోరుతున్నారు.


కంకరతేలి, గుంతలు పడి ఉన్న వెంకటతిమ్మాపురానికి వెళ్లే రోడ్డు

చెరువు మరువలో డెయిరీ నిర్మాణం

● సరికాదంటున్న ప్రజలు

గాండ్లపెంట, మే 23: మండలంలోని కటారుపల్లి పంచాయతీ ఎర్రగుట్ట చెరువు మరువలో పాల డెయిరీ నిర్మాణంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి గ్రామానికి ఒక అమూల్ పాల డెయిరీని నిర్మించి, అక్కడి పాడిరైతుల నుంచి పాలను కొనుగోలు చేసేలా ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే కటారుపల్లిలో చెరువు మరువ సమీపంలో రూ.16లక్షలకుపైగా వ్యయంతో పాల డెయిరీ నిర్మించారు. కటారుపల్లి, గొల్లపల్లి గ్రామాలకు అందుబాటులో లేకుండా తుమ్మలబైలుకు వెళ్లే రహదారిలోని ఎర్రగుట్ట చెరువు మరువలో డెయిరీని నిర్మించారని, ఇది కటారుపల్లికి దూరంగా ఉంటుందని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. ఇంజనీర్లు చెరువు మరువ పారే సమీపంలో స్థలాన్ని ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. భారీ వర్షాలు వస్తే డెయిరీకి అనువుకాదని అంటున్నారు. నీటి ఉధృతికి ఆ ప్రాంతం కోతకు గురయ్యే అవకాశముందంటున్నారు. పంచాయతీలో పలుచోట్ల ప్రభుత్వ స్థలాలున్నా, మకెవలో కట్టడం సరికాదంటుని ఆవేదన చెందుతున్నారు.


ఎర్రగుట్ట చెరువు మరువ వద్ద నిర్మించిన డెయిరీ

ఆలస్యమైతే పరీక్షకు అనుమతించం: డీఆర్వో

పుట్టపర్తి మే 23: పరీక్ష రాసే వారు ఉదయం 8:30 గంటలకే పరీక్ష హాల్‌కు చేరుకోవాలని ఆ తర్వాత వస్తే పరీక్ష కేంద్రంలోని అనుమతించేది లేదని డీఆర్వో కొండయ్య గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంస్కృతిస్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. కావున పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 7:30 నుంచి 8:30లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. లేకపో తే పరీక్షకు అనుమతించేది లేదంటూ ఆయన స్పష్టం చేశారు.

షిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

హిందూపురం అర్బన్, మే 23: పట్టణ పరిధిలోని నానెప్పనగర్‌లో వెలసిన షిర్డీసాయి మందిరంలో గురువారం పురస్కరించుకొని సాయినాథుడు వెండి సింహాసనంపై కొలువుదీరాడు. ఉదయం మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు సాయంత్రం భజనలు, కీర్తనలు ఆలపించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు. సాయినామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

లేపాక్షి, మే 23 : రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. ఈనెల 24నుంచి జూన్ 3వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మండల వ్యాప్తంగా 290మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. స్థానిక మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. రాబోయే విద్యాసంవత్సరంలో సిలబస్ మారే అవకాశం ఉందని అందువల్ల ప్రతి విద్యార్థి కచ్చితంగా పరీక్షలు రాయలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ...

అగళి, మే 23: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను శుక్రవారం నుంచి మోడల్ కళాశాలలో నిర్వ హించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. రొళ్ల, అగళి మండలాల మొదటి సంవత్సరం విద్యార్థులు 94 మంది, రెండో సంవత్సరం 100 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం 17 మంది, రెండో సంవత్సరం నలుగురు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30నుంచి 5.30వరకు పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆలస్యమైతే పరీక్షకు అనుమతించం: డీఆర్‌ఓ

పుట్టపర్తి, మే 23 : డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్షలు రాసే అభ్యర్థులు ఉదయం 8-30 గంటలకే పరీక్ష హాల్‌కు చేరుకోవాలని ఆ తర్వాత వస్తే పరీక్షలకు అనుమతించేది లేదని డీఆర్‌ఓ కొండయ్య గురువారం ఓప్రకటనలో పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సంస్కృతిస్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుండి 11-30 పరీక్ష ఉంటుందని, ఉదయం 7.30 నుంచి 8.30 గంటల్లోపు అభ్యర్థులు పరీక్షా హాల్‌కు చేరుకోవాలని సూచించారు. లేనియెడల పరీక్షకు అనుమతించేది లేదంటూ ఆయన పేర్కొన్నారు.

వాల్మీకి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపూరం అర్బన్, మే 23: పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వాల్మీకి విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని వాల్మీకి ఉద్యోగ సంఘం నా యకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో పదో తరగతిలో ప్రభుత్వ పా ఠశాలల్లో చదివిన విద్యార్థులు 480 మార్కులు ఆపైన, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 510 మార్కులు ఆపైన సాధించి ఉండాలన్నారు. అలాగే ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు అయితే 800 మార్కులు ఆపైన, ప్రైవేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు అయితే 850 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు మార్కుల మెమో, కులధ్రువీకరణ పత్రం లేదా టీసీ జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. ఇందుకు హిందూపురం అర్బన్, రూరల్, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి మండలాల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. వివరాలను కింది ఫోన్ నంబర్లు 9441665692, 7780583140లను వాట్సప్ ద్వారా పంపాలని తెలిపారు. అలాగే వివరాలకు ఆ నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, మే 23: హిందూపురం సబ్ డివిజన్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి సెక్షన్, రాచపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వి ద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ మహేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చలివెందుల, మీనకుంటపల్లి, రాచపల్లి, జంగాలపల్లి, బాలంపల్లి, చెర్లోపల్లి, పత్తికుంటపల్లి, వెలిదడకల, తుంగోడు, కోనతట్లుపల్లి, కొలింపల్లి, కావేటినాగేపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. వివరాలకు 7382720987 నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రొద్దం, మే 23 : మండలంలోని రాగిమేకలపల్లి కి చెందిన గొల్ల సోమశేఖర్(45) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురై అధికంగా మాత్రలు మింగాడు. దీంతో అస్వస్థతకు గురై చికిత్సలు పొందుతూ గురువారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాగిమేకపల్లికి చెందిన గొల్ల సోమశేఖర్ చాలా రోజులుగా కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్నిరోజులకూ నయం కాకపోవడంతో ఐదు రోజుల కిందట అధికంగా మాత్రలు మింగేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అస్వస్థతకు గురైన అతడిని బంధువులు వెంటనే పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఉష, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మే 23: మండలంలోని మల్లాపల్లికి చెందిన పార్వతమ్మ క్రిమిసంహారక మందు తాగి గురు వారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మల్లాపల్లికి చెందిన మంజునాథ్‌భార్య పార్వతమ్మ కొంతకాలంగా అనారోగ్యానికి గురై చాతి నొప్పితో తీవ్రంగా బాధపడుతోంది. ఆ బాధను భరించలేక జీవితంపై విరక్తి చెందిన క్రిమిసంహారక ద్రావకాన్ని తాగి అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెను గోరంట్ల ప్రభుతాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం హిందూపురం తరలించాల్సి ఉంది. ఓడీసీ నుంచి 108 వాహనం వచ్చేందుకు గంట ఆలస్యం కావడంతో వారు చాలా ఇబ్బంది పడ్డారు.

కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి రథోత్సవం



కోట వెంకటేశ్వరస్వామి బ్రహ్మరథాన్ని లాగుతున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) మూలవిరాట్

మడకశిరటౌన్, మే 23: పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మరథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వేలాదిగా భక్తుల నడుమ స్వామివారి బ్రహ్మరథాన్ని లాగారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మూలవి రాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు జరిపారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. న్యాయవాది వైసీ గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా ఉత్సవవిగ్రహాన్ని అర్చకులు విశేషంగా అలం కరించారు. రథంపై ఉంచి పూజలు చేశారు. పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా స్వామి వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయన రథోత్సవంలో పాల్గొని భక్తులతో పాటు రథాన్ని లాగారు. రథోత్సవం సందర్భంగా పట్టణం గోవిందనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు



బాధిత వృద్ధురాలు ఇంద్రమ్మ

చిలమత్తూరు, మే 23: సిగరెట్ కోసమంటూ దుకాణం వద్దకు వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి దుకాణంలో సరుకులు విక్రయిస్తున్న వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసుని లాక్కెళ్లాడు. మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో బుధవారం రాత్రి సుమారు 8.45 గంటల సమయం. ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చారు. అందులో ఒకడు వాహనంపైనే ఉండగా, మరో వ్యక్తి వాహనం దిగి దుకాణం వద్దకు వచ్చి సిగిరెట్ అడిగాడు. దుకాణం నడుపుతున్న వృద్ధ మహిళ ఇంద్రమ్మ అతడికి సిగిరెట్ ఇవ్వడానికి వెనుకకు తిరిగింది. సిగిరెట్ కోసం వచ్చిన వ్యక్తి ఇదే అదునుగా ఒక్క ఉదుటున ఆమె మెడలో ఉన్న బంగారం మాంగల్యం చైనును లాక్కొని వెళ్లాడు. ఆమె వెంటనే తేరుకొని కేకలు వేయడంతో పక్కనే ఉన్న వారు అతడిని వెంబడించడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే మరో వ్యక్తి సిద్ధంగా ఉంచుకున్న ద్విచక్రవాహనం ఎక్కి పరార య్యాడ. వారు ఎత్తుకెళ్లిన బంగారం మాంగల్యం చైను ఏడు తులాలు ఉందని బాధితురాలు ఇంద్రమ్మ తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారని ఇంద్రమ్మ తెలిపారు. చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవనం చేసుకునే దానిని ఆమె తెలిపారు, పోలీసులు వెంటనే దుండగులను పట్టుకొని తన బంగారు చైనును తెచ్చివ్వాలని బాధితరాలు కోరారు.

మృతుడి కుటుంబానికి సవిత పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సవిత, నాయకులు

రొద్దం, మే 23: మండలంలోని బీదానిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త ఆంజనేయులు(48) ఐదు రోజుల కిందట గుండెపోటుతో మృతిచెందాడు. టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత గురువారం బీదానిపల్లికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడకండి... అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు మాధవనాయుడు, త్రివేంద్ర, సర్పంచ్ మంజునాథ్, మాజీ రిటైర్డ్ వీఆర్‌ఓ రామాంజినేయులు, చిన్నవెంకటేశులు, మాజీ ఎంపీటీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు అమ్మితే చర్యలు: డీఎస్పీ



కల్లుగీత కార్మికులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

మడకశిర టౌన్, మే 23: కల్తీ కల్లు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా హెచ్చరించారు. మడకశిర నియోజకవర్గంలో కల్లుగీత యజమానులు, కార్మికులతో ఆయన గురువారం మడకశిర సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... రసాయనాలు కలిపి కల్తీ కల్లు విక్రయించే వారిపై పీడీ యాక్ట్, అబ్కారీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. నియోజకవర్గంలోని కల్లు విక్రయించేఅన్ని దుకాణాలను తనిఖీ చేసి ప్రతి నెల నివేదిక పంపాలని సీఐ, ఎస్ఐలకు సూచించారు. అనంతరం కల్లు నిర్వహణకు సంబంధించిన లైసెన్స్‌లను తనఖీ చేసి కల్లు యజమానులకు, కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐలు మనోహర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వెంగటమ్మనహళ్లి పోలీస్ హత్యాకాండలో మాజీ మావోయిస్ట్ అరెస్ట్

పావగడ, మే 23: తాలుకా సరిహద్దు ప్రాంతమైన వెంగటమ్మనహళ్లిలో 19 సంవత్సరాల కిందట జరిగిన పోలీస్ హత్యా కాండలో కొత్తగెరె గ్రామానికి చెందిన మాజీ మావోయిస్ట్ శంకర్‌ను పావగడ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 2005 ఫిబ్రవరి 10వ తేదీ రాత్రి వెంగటమ్మనహళ్లి పాఠశాలలో పోలీసులపై అప్పటి నక్సలైట్‌లు బాంబులు, తుపాకులతో దాడి చేశారు. ఏడుగురు పోలీసులను దారుణంగా హత్య చేసిన ఘటన అప్పుడు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలలో సంచలనం సృష్టించింది. ఈ కేసుకు సంబంధించి 200 మంది దాకా మావోయిస్టు సానుభూతిపరులను పోలాసులు అరెస్ట్ చేసి 32 మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ప్రజాగాయకుడు దివంగత గద్దర్, విప్లవ సంఘం నేత వరవరరావును కూడా 12, 13వ ముద్దాయిలుగా పావగడ కోర్టులో 2021లో హాజరు పరిచారు. ఈ ఘటనలో నాన్‌బెయిలబుల్ వారెంట్‌కు పోలీసులు ఆదేశించడంతో కొందరు నిందితులు తప్పించుకుని తిరుగుతున్నారు. అరెస్ట్ అయిన కొత్తెగెరె శంకర్ బెంగళూరులో బీబీఎంపీ డ్రైవర్‌గా గౌరీ పాళ్యంలోని వెంకటస్వామి గార్డెన్‌లో నివసిస్తుండేవాడని కచ్చిత సమాచారం పోలీసులకు అందింది. ఈ మేరకు పావగడ, తిరుమణి పోలీసులు బెంగళూరుకు వెళ్లి శంకర్‌ను అరెస్టు చేనట్లు ఎస్పీ తెలిపాడు. అరెస్ట్ అయిన శంకర్‌ను కోర్టుకు హాజరు పరిచి 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

రొద్దం, మే 23 : మండలకేంద్రంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు గురవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీసాయి రూరల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రొద్దంలోని సాయికాన్వెంట్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూపురానికి చెందిన ఆశ్రయ మల్టీ స్పెషాలిటీ వైద్యులు కిడ్నీ సంబంధిత సమస్యలు, పాముకాటు, తేలుకాటు, షుగర్, బీపీ, లివర్, ఊపిరితిత్తుల జబ్బులు, రక్త హీనత, మూర్ఛ వ్యాధి తదితర వాటికి ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆగిపోయిన సచివాలయాల నిర్మాణం



అగళిలో అర్ధంతరంగా ఆగిపోయిన సచివాలయ భవన నిర్మాణం

అగళి, మే 23: మండలంలోని సచివాలయ భవన నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు పూర్తయ్యేదెన్నడోనని మండల ప్రజలు అంటున్నారు. నాలుగైదు సంవత్సరాలుగా భవననిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కొన్ని గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ కమ్యూనిటీ భవనాల్లోనూ, అద్దె భవనాల్లోనూ సచివాలయాలను నిర్వహిస్తున్నారు. మండలంలో 11 గ్రామ పంచాయతీల్లో ఇరిగేపల్లి ఆర్‌జిపల్లి గ్రామ పంచాయతీలలో మాత్రం సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన తొమ్మిది పంచాయతీలు ఇనగలూరు, కోడిపల్లిలలో నిర్మాణాలు పునాదులకే పరిమితమయ్యాయి. మిగతా చోట్ల అరకొర నిర్మాణాలతో ఆగిపోయాయి. నిధుల కొరత కారణంగానో లేక కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లనో ఆగిపోయాయని ప్రజలు అంటున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి భవన నిర్మాణాలు పూర్తిచేయకపోవడంతో అవి అప్పుడే శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే సచివాలయం నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పునాదులకే పరిమితమైన ఆర్బీకే

భూసార పరీక్షలు లేని అగ్రిటెస్టింగ్ ల్యాబ్

● మట్టి నమూనాలను అనంతపురం తీసుకెళ్లాల్సిన పరిస్థితి
● అసహనం వ్యక్తం చేస్తున్న రైతులు



మడకశిరలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్

మడకశిర రూరల్, మే 23: భూసార పరీక్షలు నిర్వహించని అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఎందుకు అని రైతులు వాపోతున్నారు. మడకశిర మార్కెట్ యార్డు అవరణంలో 2022లో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మాంచారు. ఇందులో కేవలం విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు మాత్రమే నిర్వహిస్తు న్నారు. ల్యాబ్ లోని రికార్డుల ప్రకారం ఇప్పటి వరకు ఎరువులకు సంబంధించి 174 పరీక్షలు, విత్తనాలకు సంబంధించి 283 పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అయితే నష్టాలు రాకుండా పంటలు సాగుచేయాలంటే రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించాలి. ఎంతో ముఖ్యమైన భూసార పరీక్షలు మాత్రం ఈ ల్యాబ్ చేయడంలేదు. భూసార పరీక్షలు కోసం రైతులు మట్టి నమూనాలను తీసుకోని అనంతపురం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు వెళ్తన్నారు స్థానికం గా అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఉన్నా ఉపయోగపడడంలేదని రైతులు వాపోతున్నారు..



ల్యాబ్‌లో పరీక్షలకు పూర్తి స్థాయిలో లేని పరికరాలు

ల్యాబ్ ఉన్నా.. ప్రయోజనం లేదు



సాగుచేసే పంటల్లో నష్టాలు రాకుండా ఉండాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. మడకశిరలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఉన్నా ప్రయోజనం లేదు. ఇక్కడ మట్టి పరీక్షలు జరుపరు. దీంతో మండలంలోని రైతులు మట్టి నమూనాలు తీసుకుని అనంతపురం వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగానే భూసార పరీక్షలు చేయించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నాం

-గోవిందప్ప, మాజీ సర్పంచు, మణూరు

పరికరాలు రాలేదు

భూసార పరీక్షలకు సంబంధించి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు ఇప్పటి వరకు యంత్రపరికరాలు రాలేదు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలంటే మట్టి నమూనాలు తీసుకుని అనంతపురం వెళ్లాలి. అక్కడ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుతం విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు మాత్రమే ఇక్కడి ల్యాబ్‌లో నిర్వహిస్తున్నాం.

- ఎలిజబెత్, వ్యవసాయాధికారి, అగ్రి టెస్టింగ్ ల్యాబ్, మడకశిర

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ

హిందూపురం అర్బన్, మే 23: పట్టణ పరిధిలోని చిన్న మార్కెట్ సమీపంలో ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయం 23వ వార్షికోత్సవాలను పురస్క రించుకొనిలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు చేపట్టారు. మూ లవిరాట్‌ను ప్రత్యేకంగా అలంక రించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి హోమాల్లో పాల్గొన్నారు.



హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి: ఏఓ

అగళి, మే 23 : ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుచేసుకునే రైతులు వేరుశనగ విత్తన కాయల కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శేఖర్ నాయక్ తెలిపారు. ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఖరీఫ్ పంటల సాగు కోసం ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో విత్తన కాయలు అందజేస్తోందన్నారు. కే6 రకం విత్తనకాయలకు రైతుల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమైందన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జెరాక్స్, మొబైల్ ఫోన్‌ను తమ వెంట తీసుకురా వాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను చెల్లించి తమపేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 30కేజీల బస్తాకు రూ.1710 చొప్పున చెల్లించి విత్తన కాయలు పొందాల్సి ఉంటుందన్నారు.

అడ్మిషన్ల కోసం అధ్యాపకుల పల్లెబాట

రొద్దం, మే 23: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల కోసం అధ్యాపకులు గ్రామాల బాటపట్టారు. వారం రోజులుగా ఊరూరా తిరుగుతూ కళాశాలలో చేరాలంటూ విద్యార్థులకు, తల్లిదండ్రుటకు విజ్ఞప్తి చేస్తున్నారు. జూనియర్ కళాశాలలో ప్రతి సబ్జెక్టుకు అధ్యాపకులు ఉన్నారని, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తల్లిదండ్రులతో చర్చిస్తున్నారు. కళాశాలకు సెలవులున్నా ప్రభుత్వం, ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు అధ్యాపకులు ఊరూరా తిరుగుతూ అడ్మిషన్ల కోసం నానా తంటాలు పడుతున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అంజలీదేవి, భాగ్యలక్ష్మి, రాధిక, రమణ, షబ్బీర్, వెంకటేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్

గోరంట్ల, మే 23: మండలంలోని కరావులపల్లి తండాలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. తండా వద్ద సప్లైచానల్ పనులను నిర్వహిస్తుండగా పరిశీలించారు. చేస్తున్న పనికి దినకూలి ఎంత పడుతోందని పీడీ ప్రశ్నించగా, రూ.270 అని కూలీలు పేర్కొన్నారు. దినకూలికి సరిపడే కొలతలు చూసుకుని కూలీలు పనిచేయాలన్నారు. బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని కూలీల సంఖ్య పెంచాలన్నారు. పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం గోరంట్ల మండలపరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో పీడీ పంచాయతీల వారీగా ఉపాధి పనులపై సమీక్షించారు. రైతులకు 2024-25కుగాను పండ్లతోటల పెంపకం పట్ల అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏపీడీ శివానందనాయక్, ఎంఎన్‌డీ శివానంద్, ఏపీఓ వరప్రసాద్ తదితరులున్నారు.

విస్తృతంగా కార్డెన్ సెర్చ్‌లు: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మే 23: సార్వత్రిక ఎన్నికల కౌం టింగ్ నేపథ్యంలో జిల్లాలో వి స్తృతంగా కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీపీఓలో గురువారం ఎస్పీ మాట్లాడుతూ.. కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాతనేరస్థుల ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవ ని హెచ్చరించారు. ఆర్‌సీలేని ద్విచక్రవాహనాలను సైతం సీజ్ చేస్తున్నామన్నారు. పరిగి మండలం బీజుగానిపల్లిలో ఆరు బైక్‌లు, ఐదు వేటకొడవళ్లను సీజ్ చేశామన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'



రాజకీయ నాయకులకు సూచనలిస్తున్న పోలీసులు

లేపాక్షి, మే 23 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వ హిస్తున్నందున మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని హిందూపురం రూరల్ సీఐ ఈర న్న అన్నారు. ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అన్ని రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహిస్తున్నారని, అందుచేత ఎటువంటి ర్యాలీలు, నిర్వహించ కూడదన్నారు. గుంపులుగా ఉన్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా రౌడీషీటర్‌గా కేసు నమోదు, జిల్లా బహిష్కరణ, 30యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫలితాలు వెలువడే రోజున టపాసులు పేల్చేందుకు అనుమతులు లేవన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. కేంద్ర బలగాలు మండలంలో మొహరించాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



దిన్నెహట్టి గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐలు

గుడిబండ : గ్రామాల్లో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటా మని మడకశిర అర్బన్, రూరల్ సీఐలు మనోహర్, రాజ్‌కుమార్ హెచ్చరించారు. వారు గురువారం గుడిబం డ మండలం మండలపల్లి పంచాయతీ దిన్నెహట్టి గ్రామంలో ఐదు మండలాల ఎస్ఐలతో పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు సమస్యాత్మక గ్రామమైన దిన్నెహట్టిలో నేరచరిత్ర కలిగిన ఇళ్లను తనిఖీ చేశామని తెలిపారు. దుకాణదారు లు లూజు పెట్రోల్, డీజిల్ అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కౌంటింగ్ సంద ర్భంగా గ్రామాల్లో గొడవలు, ఘర్షణలు లేకుండా శాంతి యుతంగా ఉండాలని ప్రజలకు సూచించారు. గొడవలు, ఘర్షణలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం పలు ఇళ్లను తనిఖీ చేసి రికార్డులులేని 17ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్, అమరాపురం ఎస్ఐ జనార్దన్‌నాయుడు, అగళి ఎస్ఐ వీరేష్, ఐదు మండలాలల ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.